# భాస్కరం - రూపాయి

-పొత్తూరి విజయలక్ష్మి

ఇంట్లోకి రాగానే అలవాటు ప్రకారం ఫోన్లేమైనా వచ్చాయా? అని అడిగాను. "రూపాయి బామ్మగారు ఫోన్ చేశారు. వాళ్ళ మనవరాలికి డెలివరీ అయిందిట. అమ్మాయి పుట్టిందిట" అని చెప్పింది నా కోడలు.

"అలాగా! ఇంకేం చెప్పింది అత్తయ్య?" అని అడిగాను.

"ఇంకేం చెప్పలా! రాగానే మిమ్మల్ని ఫోన్ చెయ్యమన్నారు. మీ అత్తగారు తలతిక్క మనిషి. సెల్‌ఫోన్ కొనుక్కోవే అంటే వినదు. ఊరందరిదీ ఓదారీ ఉలిపి కట్టెది ఓదారీ అన్నట్లుంటుంది దీని వ్యవహారం అన్నారు" అని చెప్పింది కోడలు.

నీకేం లేదా పోదా? ఓ సెల్‌ఫోన్ కొనుక్కోరాదా! అని శ్రేయోభిలాషులు అందరూ చెప్తారు. కానీ నాకా సెల్ ఫోనంటే తలనొప్పి. అదుంటే ఎక్కడో వున్న వాళ్ళతో తప్ప ఎదురుగా వున్న వాళ్ళతో మాట్లాడే అవకాశం వుండదు. మా వాళ్ళంతా వస్తారు. వచ్చిందగ్గిర్నించీ ఆ సెల్ ఫోన్లో మాట్లాడుతూ సైగలతోనే యోగక్షేమాలు అడిగి, కాఫీ గట్రా సేవించి, సెల్‌లో మాట్లాడుతూనే వెళ్ళిపోతారు. అందుకే సెల్‌ఫోన్ జోలికి పోను నేను.

మామూలు ఫోన్‌లోనే మా రూపాయి అత్తయ్యతో మాట్లాడాను. అన్నీ వివరంగా చెప్పింది. "వీలు చూసుకుని రా ఓసారి" అని ఫోను పెట్టేసింది.

మా రూపాయి అత్తయ్య చాలా ప్రత్యేకమైన మనిషి.

నేను ఫస్టుఫారమ్‌లో వుండగా మా అత్తయ్య పెళ్ళి అయింది. మా ఇంట్లో జరిగే మామూలు పెళ్ళిళ్ళకు భిన్నంగా జరిగిందా పెళ్ళి. పెద్దగాలి దుమారం లేపింది.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పై చదువులకు వెళ్ళిన మా భాస్కరం మావయ్య అక్కడే తనతో చదువుకుంటున్న ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి వాళ్ళు, మన తెలుగు వాళ్ళు కాదు. ఉత్తరప్రదేశ్ వాళ్ళట.

పెళ్ళయ్యాక ఎవరో అకాశరామన్న ఉత్తరం రాస్తే తెలిసింది మా తాతగారూ వాళ్ళకి. భాస్కరం మామయ్య వాళ్ళ నాన్నగారు, మా తాతగారికి బావమరిది వరస. ఎదురుబొదురు ఇళ్ళు. అంతా ఒకే కుటుంబంలా వుండే వాళ్ళు అందరూ.

ఆ విషయం తెలియగానే మొహం తిరిగి పడిపోయారుట వాళ్ళింట్లో ఆడవాళ్ళు. శివతాండవం చేశారుట మామయ్య వాళ్ళ నాన్నగారు. ఇక వాడు మాకు వున్నా లేనట్లే. ఈ జన్మలో వాడినీ గడప తొక్క నివ్వను. వాడి మొహం చూడను అని ప్రతిజ్ఞ చేశారుట.

'వంశానికంతటికీ ఒక్క మగనలుసు. పోయిపోయి ఆ హిందీ పిల్లని పెళ్ళి చేసుకున్నాడు. అంతమాత్రం అమ్మాయి మనూళ్ళో దొరకదా వీడికి? అసలు వీళ్ళని అనాలి. లక్షణంగా మన గుంటూరులో చదివించక ఎక్కడో కాశీకీ పంపించారు గొప్పగా పై చదువులకి. అక్కడ అడ్డుకునేవాళ్ళు మందలించే వాళ్ళూ లేకపోయే సరికి తప్పుదారి పట్టాడు" అనుకున్నారు బంధువు లందరూ.

తన చదువు పూర్తికాగానే ఇంటికి వస్తానని ఉత్తరం రాశాడు మామయ్య.

ససేమిరా రాలేదు. అక్కడే గంగలో దూకు అన్నారుట తండ్రిగారు. గంగలో దూకలేదు గానీ అక్కడే ఉద్యోగం చూసుకుని కాపురం పెట్టాడు మామయ్య. ఉత్తరాలు రాస్తూనే వుండే వాడు.

అలా కొంతకాలం గడిచింది. ఇక్కడ మామయ్య వాళ్ళ బామ్మ మనవడి మీద దిగులు పెట్టుకుంది. తెలిసిన వాళ్ళు ఎవరో తెనాలి నుంచి కాశీయాత్రకి వెళ్తుంటే "నాయనన్నాయనా కాస్త మా మనవడి భోగట్టా ఏమైనా తెలుస్తుందేమో చూడండి" అని అడ్రస్ ఇచ్చి పంపించిందిట ఇంట్లో వాళ్ళకి తెలియకుండా.

వాళ్ళు వచ్చీరాగానే సమారాధన చేసుకుంటూ వీళ్ళని పిలిచారుట. వీళ్ళంతా వెళ్ళారు. అక్కడ భాస్కరం మామయ్యని కలిశారుట. మామయ్య ఎంతో సంతోషించాడుట. దగ్గరుండి అన్నీ చూపించాడుట. మా వాళ్ళంతా బావున్నారా అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడట. భార్య కడుపుతో వుందిట. పుట్టింటికి వెళ్ళిందిట.

ఆ వివరాలన్నీ విని వీళ్ళ ప్రాణం కొట్టుకులాడింది.

ఇంకా ఎంతకాలం ఈ పట్టింపులు? అయిందేదో అయిపోయింది. వంశోద్ధారకుడు పుట్టబోతున్నాడు. ఇకనైనా వాడిని క్షమించి ఇంటికి పిలవండి అని సలహా ఇచ్చారుట ఆ తెనాలి వాళ్ళు.

తల్లీ బామ్మా భాస్కరం మామయ్యని పిలుద్దాం అంటే తండ్రి మాత్రం నేను పిలవను. వాడొస్తే వద్దనను అన్నాడుట బింకంగా.

అలా కొంతకాలం గడిచింది. భాస్కరం మామయ్యకి కొడుకు పుట్టాడనే శుభవార్త వచ్చింది. వీళ్ళ సంబరం అంతా ఇంతాకాదు.

తండ్రికి ఈ శుభవార్త తెలియజేస్తూ మీరు సరేనంటే మీ మనవడిని తీసుకుని మనింటికి వస్తాను అని రాశాడుట మామయ్య.

వెంటనే సిద్ధాంతిగారి దగ్గరకు వెళ్ళి మంచిరోజు చూసి ఫలానా రోజు బావుంది. కోడల్నీ మనవడినీ తీసుకు రావలసింది అని సమాధానా రాశాడుట పెద్దాయన.

ఇక చెప్పేదేముంది? ఇల్లంతా ఒకటే సందడి. అనుకున్న వేళ్టికి వచ్చాడు మామయ్య భార్యాబిడ్డలతో.

ఊళ్ళో మా వాళ్ళందరూ వచ్చారు. అందరం అక్కడే వున్నాం. ఇరవై నాల్గుంటలూ వాళ్ళ కబుర్లే.

పిల్ల చూశావా ఎంత బావుందో దంతం బొమ్మలా వుంది. ఆ చక్కదనం చూసే మనవాడు సరదా పడాడ్డు. పసివాడు పనస పండులా వున్నాడు అని మురిసిపోయారు.

ఉత్తరప్రదేశం వాళ్ళేగానీ వాళ్ళూ మన బ్రాహ్మ లేనట. వాళ్ళింట్లో ఉల్లిపాయకూడా ముట్టరట.

పిల్లతో ఎంత సామానూ సరంజామా పంపేరో చూశారా? పెళ్ళి తర్వాత మొదటిసారి అత్తవారింటికి వెళ్తోందని ఇంటిల్లిపాదికీ బట్టలు పంపేరుట అత్తగారికీ, ఇద్దరు ఆడబడుచులకీ జరీపూల బెనారసు చీరెలు పంపారు. చూస్తేనే కళ్ళు చెదిరిపోతున్నాయి.

ఏంటేంటో వింతవింత మిఠాయిలు పంపేరుట. అవిగాక పటిక బెల్లం, సీమ బాదంపప్పు, జీడిపప్పు, ఖర్జూరం పళ్ళు ఇన్నేసి పంపించారుట.

వాళ్ళల్లా ఆడపిల్ల ఇంటికి రావడం ఆచారం కాదుట. అందుకే ఎవరూ వెంట రాలేదుట. మీరు వీలు చూసుకుని అందరితో వచ్చి మా ఇంటిని పావనం చెయ్యండి అని వియ్యంకుడు వినయంగా ఇంగ్లీషులో ఉత్తరం రాసి కూతురికిచ్చి వియ్యంకుడికి పంపిం చారుట.

మన ప్రాంతం వాళ్ళు కాదుగానీ పాపం మంచివాళ్ళే. మర్యాదస్తులు. మొత్తానికి మన నరసింహం, కామాక్షీ అదృష్టవంతులే. మంచి కోడలు దొరికింది అనుకున్నారు.

అమ్మాయి పేరు రూపాయిట.

"మనం మనవైపు ధనలక్ష్మీ, పవిడమ్మా, భాగ్యలక్ష్మీ అని పేర్లు పెట్టడం లేదూ. అటు వైపు ఉత్తరప్రదేశం కాబట్టి రూపాయీ, అర్ధరూపాయీ, పావలా అని పేర్లు పెట్టుకుంటారు కామోను అనుకున్నారు.

అమ్మాయి రూపాయీ అంటూ ఆదరంగా పలకరించారు.

ఎటొచ్చీ భాషే రాకపోయే. చిలకలా నవ్వడమే తప్ప ఒక్క ముక్క మాట్లాడే అవకాశం లేదు రూపాయికి.

మా పిల్లగుంపుని పిల్చి మీరు హిందీలు వెలగ బెడుతున్నారుగా ఆ రూపాయితో ఓ మాట మాట్లాడ లేరూ అని మమ్మల్ని అడిగేరు.

ఏదో హిందీ టీచరు భయానికీ, హిందీలో పాసు మార్కులు రాకపోతే పరీక్షలు తప్పిస్తారని బెదురుతూను హిందీ నేర్చుకుంటున్నాం గానీ మాకేం వచ్చు? పానీ, అచ్ఛా ఆ రెండు మాటలే వచ్చు.

అవే ఎంత సేపు మాట్లాడతాం. మామయ్య మాత్రం హిందీ సినిమాలో దేవానంద్‌లాగా గలగల మాట్లాడేస్తున్నాడు హిందీ.

మామయ్య దగ్గరికి వెళ్ళి "మామయ్య నువ్వు ఇంత బాగా హిందీ నేర్చేసుకున్నావు కదా. మరి రూపాయి అత్తయ్యకి తెలుగు నేర్పలేదేం!" అని నిలదీసి అడిగేం.

"శ్రీరామచంద్ర ప్రభూ" దాని పేరు రూపాయి కాదు రూపాలి. బామ్మకి నోరు తిరక్క రూపాయి రూపాయి అని మొదలు పెట్టింది" అంటూ నవ్వేశాడు మామయ్య. అంతేగాదు అడ్డగాడిదల్లాగా ఇంతమంది వున్నారు కదా! కాస్త మీ అత్తయ్యకి తెలుగు నేర్పండి అని ఆ బాధ్యత మా మీదే పెట్టాడు.

అత్తయ్య పేరు రూపాయికాదు రూపాలిట అని పెద్ద వాళ్ళకి చెప్పాం. కానీ వాళ్ళు రూపాలు ఏవిటి పాపాలు రూపాయే బావుంది అన్నారు. ఆ పేరే స్థిర పడిపోయింది.

మా మామయ్య మళ్ళీ కాశీ వెళ్ళలేదు. గుంటూర్లోనే ఉద్యోగం వచ్చింది. మా అత్తయ్యకు తెలుగు నేర్పడం ప్రారంభించాం.

మెదట్లో మీ తాతయ్య అన్నం తింటున్నాడు. కుక్కగారు లోపలికి వచ్చేస్తున్నారు అని అస్తవ్యస్తంగా మాట్లాడినా త్వరగానే నేర్చేసుకుంది.

ఏడాది తిరిగేసరికి "ఇట్లా నాగాలు పెడితే మాన్పించేస్తాను జాగ్రత్త" అని పని మనిషిని మందలించే స్థితికి చేరుకుంది. రోజూ శేష్‌మహల్లో రెండో ఆట సినిమాలు చూసేస్తూ భాషాజ్ఞానం వృద్ధి చేసుకుంది.

మావగారు దేవతార్చనలో వుంటే 'మావయ్య గారు! మీ కోసం జొన్నాభట్ల విఘ్నేశ్వరరావు గారుట వచ్చారు. వుండమంటారా, మళ్ళీ రమ్మంటారా' అంటూ మాట్లాడేస్తుంటే ఆ మావగారి మురిపెం చూడాల్సిందే.

శుక్రవారం నాడు 'మంగళ హారతీ గైకొనూ పార్వతీ' అని పూజ దగ్గర మంగళ హారతి పాడుతుంటే అత్తగారికి ఆనంద బాష్పాలు వచ్చేవి.

చుట్టాలందరికీ సుస్పష్టంగా తెలుగులో మాట్లాడుతూ తల్లోనాలికలా మారిపోయింది.

అందుకే ఎంతమంది వున్నా అప్పటికీ ఇప్పటికీ మా ఇంట్లో మా రూపాయి అత్తయ్యది ప్రత్యేక స్థానం. ■